క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలి



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం బృందం నగరంలోని మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. బిల్డింగుల కొరత, టీచర్ల కొరతను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

హంద్రీలో కంప చెట్లను తొలగించాలి



హంద్రీలో కంప చెట్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : బుధవారపేట కొత్త బ్రిడ్జి వెంబడి హంద్రీలో పెరిగిన కంప చెట్లను తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ, ఆర్.కృష్ణయ్య, కె.రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం బృందం కంప చెట్లను పరిశీలించారు. వెంటనే కంప చెట్లను తొలగించి బుధవారపేట వాసులకు భద్రత కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రాత్రిళ్లు పాములు, తేళ్లు, ఇతర విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నట్లు చెప్పారు. అలాగే రాత్రిళ్లు దోమలు నుంచి నరకం చూస్తున్నట్లు చెప్పారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి



కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక వెంకటరమణ కాలనీ, ప్రకాష్‌నగర్, రోజా వీధి, అశోక్ నగర్, బంగారుపేట, చల్లా కాంపౌండ్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి వీధిలో వారానికోసారి పూడికతీత పనులు చేపట్టాలన్నారు. డ్రైనేజీ కాల్వలపై ఆక్రమణలు ఉంటే ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఏఈ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రెండో బెటాలియన్ పూర్వ కమాండెంట్ మృతి



రవిశంకర్ (ఫైల్)

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ పూర్వపు కమాండెంట్ రవిశంకర్ (63) అనారోగ్యంతో హైదరాబాదులోని ఏజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందారు. ఈయన 2020 సెప్టెంబర్ 1 నుంచి 2024 జనవరి 31 వరకు కర్నూలు బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసి కడప బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. పదవీ విరమణకు రెండు నెలల ముందు తిరిగి కర్నూలుకు బదిలీపై వచ్చారు. ఆగస్టు, సెప్టెంబర్ రెండు మాసాల పాటు కమాండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాదు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందారు. ఆయన మృతికి పలువురు అధికారులు సంతాపం ప్రకటించారు.

వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులు (50) అనే వ్యక్తి కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు గంజిహళ్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులుకు భార్య మీనాక్షి, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరు గ్రామంలో వ్యవసాయ పనులతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే నరసింహులు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడేవాడు. చికిత్స చేయించుకున్నా నయంకాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నరసింహులును చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కలుషిత నీరు, ఆహారంతో వ్యాధులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మహేశ్వరప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): వర్షాకాలంలో కలుషిత నీరు, ఆహారం వల్ల వ్యాధులు వస్తాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర ప్రసాద్ చెప్పారు. ఓఆర్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, దాహం, నోరు ఎండిపోవడం, మూత్రవిసర్జన తగ్గిపోవడం, కళ్లలోనికి పోవడం, చర్మం సాగేగుణం కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినరాదని, ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని, ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలపై ఈగలు వాలడం ద్వారా అనేక వ్యాధులు ప్రబలుతాయన్నారు. వాంతులు, విరేచనాలు మొదలైతే ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌ను ఒక లీటర్ నీటిలో పూర్తిగా కరగబెట్టి విరేచనమైన ప్రతిసారీ తాగించాలన్నారు. ఒకసారి కలిపిన ద్రవాన్ని 12 గంటల్లోపు వాడాలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా లభిస్తాయన్నారు. ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక లక్ష్యాల సాధనకు సంబంధిత శాఖలు కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్-లక్ష్యాల సాధన సూచికలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ అమలులో భాగంగా ప్రతి సంవత్సరం 15 శాతం వృద్ధి రేటు సాధించేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించిన లక్ష్యాలను గతేడాదే నిర్ణయించామని, వాటి సాధన కోసం కృషి చేసి నివేదికలను పోర్టల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. 2025-26 సంవత్సరానికి నిర్దేశించిన నెలా, త్రైమాసికం, అర్ధ సంవత్సరం, సంవత్సరం లక్ష్యాలను కూడా నివేదికల్లో పొందుపరచాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను మండలాల వారీగా విభజించి సాధన కోసం కృషి చేసేలా చూడాలన్నారు. ఆగస్టు 8వ తేదీలోపు మండల స్థాయిలో డేటా ఎంట్రీ పూర్తి చేయాలని సూచించారు. డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ హిమప్రభాకరరాజు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): మత సామరస్యాన్ని కించపరిచేలా మాట్లాడిన శ్రీశైలం చెక్‌పోస్టు సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్‌ఎండీ షరీఫ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎప్పటినుంచో ఆర్టీసీలో మతాలకు అతీతంగా డ్రైవర్లు, కండర్లు పనిచేస్తున్నారని, హిందూ మతస్తులను వదిలి ఇతర మతస్తులపై నిరాధార ఆరోపణలు, అవమానాలు చేయడం తగదన్నారు. దీనిపై శ్రీశైల మల్లికార్జున స్వామి పాలక మండలి విచారణ జరపాలని కోరారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

- మున్సిపల్ దుకాణాలు, అద్దెల వివరాలు ఇవ్వని రెవెన్యూ సిబ్బంది
- మెమోలు జారీ చేసిన రెవెన్యూ అధికారి జునీద్

కర్నూలు (టౌన్): స్వయాన నగరపాలక కమిషనర్ పలుమార్లు రెవెన్యూ సిబ్బందిని ఆ విభాగానికి సంబంధించిన వివరాలు కావాలని కోరారు. నగరంలో మున్సిపల్ దుకాణాల వివరాలు, అద్దెల వివరాలు, వసూళ్లు, బకాయిల వివరాలు అడిగినా రెవెన్యూ సిబ్బంది ఇవ్వకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఎన్నిసార్లు గుర్తు చేసినా కమిషనర్ ఆదేశాలు సైతం బేఖాతరు చేశారు. దీనిపై సీరియస్ అయిన కమిషనర్ వారందరికీ మెమోలు జారీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ మేరకు రెవెన్యూ అధికారి జునీద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు జారీ చేశారు. రెవెన్యూ విభాగంలోని జి.సోహెయిల్ అహమ్మద్ (సీనియర్ అసిస్టెంట్), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు టీ.శ్రీనివాసులు, ఎస్.తిప్పన్న, ఎం.రాజు, ఎస్.మన్సూర్ బాషా, పి.భార్గవ్, శివ శంకర్‌కు నోటీసులు జారీ చేశారు. నిర్ణీత గడువులోపు లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై చర్యలేవీ?



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు సిటీ: నిబంధనలు ఉల్లంఘించిన బీఈడీ కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బి.తాండ్రపాడు సమీపంలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస, రాఘవేంద్ర బీఈడీ కాలేజీల ఎదుట ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఏ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. టీచర్ శిక్షణ ఇచ్చే బీఈడీ కాలేజీలు అవినీతి అక్రమాలకు నిలయాలుగా మారాయన్నారు. ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా కాలేజీలను నిర్వహిస్తున్నారని, సొంత భవనాలు లేవని, ఉపాధ్యాయ విద్యను అభ్యసిస్తున్న వారికి ఎలాంటి బోధన చేయకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. కాలేజీ ఫీజు కంటే అదనంగా వసూలు చేస్తూ చూచిరాతలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కనీస అవగాహన లేని వారితో బోధన చేయిస్తున్నారని మండిపడ్డారు. బోధన, బోధనేతర సిబ్బందికి కాలేజీ ఖాతాల నుంచి వేతనాలు ఇవ్వాల్సి ఉండగా, క్యాష్ రూపంలో వేతనాలు ఇస్తున్నారన్నారు. బీఈడీ కాలేజీలపై ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా ఆర్‌యూ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇకనైన స్పందించాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్లపై లాఠీచార్జ్ అమానుషం



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): నెల్లూరులో మున్సిపల్ వర్కర్లపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, విజయ రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్ అన్నారు. కార్మికులపై దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఈ మేరకు మంగళవారం గడియారం ఆసుపత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్మికులపై లాఠీచార్జ్ చేయించిన సీఐ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్లను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించరాదని 14 రోజులుగా పోరాటం చేస్తున్న వారిపై లాఠీచార్జ్ చేయడం మంచిది కాదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కూటమి ప్రభుత్వం చూడాలని, లేదంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఖాజాపాషా, నాగస్వాములు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఐదు మంది ఎన్నికకు సంబంధించి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. తాజాగా ఇద్దరు కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత రెడ్డి, షాషావలీ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలో ఐదుగురు మాత్రమే నిలిచారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు. దీంతో బరిలో ఉన్న వెంకటేశ్వర్లు, మునెమ్మ, సాంబశివరావు, నారాయణ రెడ్డి, షేక్ అహ్మద్ ఎన్నికలు నిర్వహించకుండానే దాదాపు ఏకగ్రీవమయ్యారు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 1న నగరపాలక సంస్థలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏకగ్రీవంగా గెలుపొందడంతో వారికి నియమాక పత్రాలు అందజేయనున్నారు.

జల మండలి సీనియర్ స్టెనోకు పదోన్నతి



సీఎస్.విజయకుమార్

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ కార్యాలయంలో సీనియర్ స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తున్న సీఎస్.విజయకుమార్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆ సర్కిల్ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1993లో స్టాఫ్ సెలక్షన్ ద్వారా అప్పర్ డివిజన్ స్టెనోగ్రాఫర్‌గా ఎంపికై భారత పార్లమెంటులో పని చేశారు. ఆ తరువాత 1995 జూలైలో అప్పటి ప్రభుత్వం ఏపీపీఎస్‌సీ సీనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా మంచి ర్యాంకుతో ఉద్యోగం పొందారు. ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర సచివాలయంలో కార్మిక, ఫ్యాక్టరీల శాఖలో పని చేశారు. 2004లో జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్‌లో విధుల్లో చేరారు. 2009 తుంగభద్ర నది వరదల సమయంలో ఆయన సేవలకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం పదోన్నతి పొందడంపై ఆ సర్కిల్ ఆఫీస్ సిబ్బంది, ఇంజినీర్లు అభినందనలు తెలిపారు.

బీపీఈడీ ఫలితాలు విడుదల చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న బీపీఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ త్వరలో డీఎస్సీ ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో బీపీఈడీ ఫలితాల విడుదలలో జాప్యం జరిగితే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మే నెల 13వ తేదీ నాటికి పరీక్షలు పూర్తయినప్పటికీ ఫలితాల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎగ్జామినేషన్స్ కంట్రోలర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజీవ్, శరత్, రాఘవేంద్ర, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల దుర్మరణం



మృతిచెందిన శాంతిరాజు, శివ

కోడుమూరు రూరల్: కోడుమూరు-కర్నూలు రోడ్డులో నెరవాడ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చనుగొండ్లకు చెందిన ఏబెల్ కుమారుడు శాంతి రాజు(20), యిర్మీయా కుమారుడు శివ(18) కర్నూలులో ఒకరు ఏసీ మెకానిక్, మరొకరు తాపీ మేస్త్రీగా పని చేస్తున్నారు. వారిద్దరూ కలిసి మంగళవారం రాత్రి కర్నూలు నుంచి బైక్‌పై స్వగ్రామం చనుగొండ్లకు బయలుదేరారు. మార్గమధ్యలో నెరవాడ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక యువకులిద్దరూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కె.నాగలాపురం ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా చేతికొచ్చిన కుమారులను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు వర్ణనాతీతం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని చిలకలడోణ గ్రామానికి చెందిన బోయ మహానంది(46) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. సోమవారం రాత్రి హాలహర్వి- చిలకలడోణ గ్రామాల మధ్య 167వ జాతీయ రహదారిలో కారు బైకును ఢీకొనడంతో బోయ మహానంది తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృత్యువాత పడ్డాడు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతిడికి భార్య గోవిందమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆంజనేయులు,, నాయకులు వీరేష్ రెడ్డి, హనుమప్ప, డీలర్ రాఘన్న పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



మహ్మద్ వలితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్‌ఎస్‌ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మహ్మద్ వలి అనే విద్యార్థి విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో 72 కేజీల విభాగంలో వ్యక్తిగత ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆగస్టు 19, 20, 21 తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్‌ఎం శోభ మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో పాటు పాఠశాల పీడీలు వెంకటేష్, బసవరాజు, సుజనకుమారిలను ఆమెతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, తిమ్మప్ప, కరెకృష్ణ, భీమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ కేంద్రంలో డీఎంహెచ్‌ఓ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూల(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ పి.శాంతికళ మంగళవారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని ఒయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఫారం-6 నుంచి 15 రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏఆర్‌టీ క్లినిక్‌లు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా వైద్య ఆరోగ్యశాఖలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. దీనికోసం ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు సబ్మిట్ చేసిన అనంతరం ప్రింట్ తీసి ప్రతి పేజీలో సంతకం, సీల్‌వేసి ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని బ్యాంక్ డీడీ (ఏఆర్‌టీ క్లినిక్ లెవెల్-1కు రూ.50 వేలు, లెవెల్-2కు రూ.2 లక్షలు, ఏఆర్‌టీ బ్యాంక్‌కు రూ.50 వేలు, సరోగసి క్లినిక్‌కు రూ.2 లక్షలు)ని డిస్ట్రిక్ట్ అప్రాప్రియేట్ అథారిటీ (ఏఆర్‌టీ అండ్ సరోగసి యాక్ట్), డీఎంహెచ్‌ఓ, కర్నూలు పేరిట దరఖాస్తుతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఈ దరఖాస్తును జిల్లాస్థాయి కమిటీ ఆమోదించి అర్హత కలిగిన కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



తెర్నేకల్ సురేందర్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని ఆ పార్టీ కర్నూలు పార్లమెంటు రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీ కర్నూలు పార్లమెంటు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఆయన్ను స్థానిక సీతారామనగర్‌లోని స్వగృహంలో తెర్నేకల్ గ్రామ సర్పంచ్, పంచాయతీరాజ్ అధ్యక్షుడు మొగతాల్ అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ కనుకు సులోచనమ్మ, వీరన్న, ఎంపీటీసీ నామాల శ్రీనివాసులులు తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పాలనలో అన్ని విభాగాల్లో విఫలమైందన్నారు. సీఎం చంద్రబాబు హామీలు నమ్మి రైతులు, మహిళలు, యువత ఘోరంగా మోసపోయారన్నారు. 8 నెలల్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలిచి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు కురువ ఈరన్న, చెరువు దొడ్డెప్ప, పులి నరేష్, లింగన్న, యేసేపు, నాగప్ప, సుందరాజు, మాదన్న పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా 5న ఆందోళనలు



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య తెలిపారు. మంగళవారం సీపీఐ సీఆర్ భవన్‌లో జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు విరుపాక్షి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా చేపట్టే ఆందోళనలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే ఆగస్టు 9, 10, 11 తేదీల్లో కర్నూలులో నిర్వహించే 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ నాయకుడు నారా లోకేష్ ఎన్నికల ముందు స్మార్ మీటర్లను పెడితే పగలగొట్టాలని చెప్పి ఇప్పుడు కిమ్మనకుండా ఉండడం అన్యాయమన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు వెంటనే రూ.20 వేలు ఇవ్వాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు, ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడారు. బహిరంగ సభ అనంతరం జరిగే ప్రతినిధుల సభకు జిల్లాలోని పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, ఏపీ మహిళా సంఘాలకు చెందిన 300 మంది ప్రతినిధులు పాల్గొనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అవులశేఖర్, నక్కిలెనిన్ బాబు, మునెప్ప, బీమలింగన్న, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.50 వేలు విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి మంగళవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. కర్నూలు వాస్తవ్యులైన శివరామ కృష్ణయ్యశెట్టి కుటుంబ సభ్యులు రూ.50 వేలు నగదు రూపంలో అందజేసినట్లు అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులు, బాండును, ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు లోకరాజ్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పనుల పునఃప్రారంభంపై సమీక్ష



ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న పర్యవేక్షక ఇంజినీర్ బాలచంద్రారెడ్డి

కర్నూలు (సిటీ): జిల్లాలోని పశ్చిమ ప్రాంత భూములకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ఆర్‌డీఎస్, వేదవతి ప్రాజెక్టుల పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిపివేసింది. ఈ ప్రాజెక్టుల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ఇటీవలే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 71 ప్రాజెక్టుల పనులను పునఃప్రారంభించేందుకు ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు జిల్లాలోని వేదవతి, ఆర్‌డీఎస్ ప్రాజెక్టుల పనుల పునఃప్రారంభంపై ఇంజినీర్లు ఆయా ప్రాజెక్టుల సంబంధిత ఏజెన్సీలతో మంగళవారం జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ కార్యాలయంలో పర్యవేక్షక ఇంజినీర్ బాలచంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌డీఎస్, వేదవతి ప్రాజెక్టులను పునఃప్రారంభించేందుకు ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు పనులు ప్రారంభించాలని సూచించారు. ఆర్‌డీఎస్ భూసేకరణకు కావలసిన నిధులకు నివేదిక ఇవ్వాలని, పనులు చేసేందుకు కావలసిన నిధులు, పెండింగ్ బిల్లులకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలన్నారు. కావున ఇంజనీర్లు వీలైనంత త్వరగా వివరాలను అందించాలన్నారు. అదే విధంగా వేదవతి ప్రాజెక్టు పనులు మొదలుపెట్టాలని, భూసేకరణ ఇప్పటివరకు ఎంత చేశారు? ఎంత చేయాల్సి ఉందో వివరాలు తెలపాలని, పర్యావరణ అనుమతులకు సంబంధించిన వాటి గురించి సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు.

పాదయాత్రగా ఉరుకుందకు..



కాలినడకన ఉరుకుందకు తరలివస్తున్న ఈరన్న స్వామి భక్తులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకునేందుకు మంగళవారం కర్నూలు వద్ద ఉన్న పెద్దపాడు నుంచి 200 మంది భక్తులు కాలినడకన వచ్చారు. గత 15 సంవత్సరాల నుంచి పాదయాత్రగా స్వామి దర్శనార్థం వస్తున్నట్లు వారు తెలిపారు. స్వామి దర్శనానికి పాదయాత్రగా రావడం వల్ల కోరిన కోర్కెలు తీరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

వర్షం కోసం పాదయాత్ర



భజన చేస్తూ పాదయాత్ర సాగిస్తున్న చెరుకులపాడు అంజనేయస్వామి భక్త బృందం

వెల్దుర్తి: వానదేవుడు కరుణించాలని, సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మంగళవారం మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి భక్తులు పలు గ్రామాల్లో భజనలు చేస్తూ పాదయాత్రగా సాగి పూజలు చేశారు. చెరుకులపాడు నుంచి కొసనాపల్లె, మంగంపల్లె, హైవే-44 మీదుగా మదార్పురం, వెల్దుర్తి, నార్లాపురం, వెంకటాపురం, కొట్టాల, కొత్తూరు గ్రామాల మీదుగా భజనలు, కీర్తనలు చేస్తూ పాదయాత్రగా సాగి ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి, నరసింహస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో చెరుకులపాడు ఎర్రమల, ఎల్లరాముడు, నక్కల ఎల్లప్ప, రామదాసు, చిరంజీవి, రాజమోహన్, లక్ష్మన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.